అమ్మకాని అమ్మ

ఎలక్ట్రాన్

“సీతాపతి రత్నావతిని ఉంచుకున్నాడు, తెలుసా ?!” బస్‌స్టాండ్ వదలి, యిల్లు చేరేలోపున కనీసం పదిమందైనా పనికట్టుకొని నన్నాపి, ఈ విషయం అడిగినట్లే అడిగి తెలియజేశారు. వాళ్ళంత ఉబలాటంగా తహతహలాడుతూ నాకు చెప్పటానికి కారణం సీతాపతీ, నేనూ చిన్నతనంనుంచీ స్నేహితులవటమే. సామాన్లు ముందుగా మోసుకుపోయిన వెంకటస్వామి ద్వారా నా రాక సంగతి తెలిసిన శ్రీమతి, నేను యింట్లో అడుగుపెట్టేసరికి, ముందు వరండాలో కాలు కాలిన పిల్లిలా పచార్లు చేస్తోంది. నన్ను చూస్తోనే కళ్ళింతగా చేసుకొని, “ఏమండీ, ఈ మాట విన్నారూ...?” అని మొదలుపెట్టింది.

“విన్నాను కానీ, ముందు స్నానానికి ఏర్పాట్లు చెయ్యి!” అన్నాను, మా ఆవిడ పురాణాన్ని మరి ముందుకు సాగదీయకుండా. ఉత్సాహమంతా బుడగలా

పేలిపోయి, బేలగా నిల్చున్న శ్రీమతిని చూసి నాకు జాలివేసింది.

భోజనం చేస్తున్నప్పుడు, ప్లేటు ఫిరాయించి నా చేత విపరీతంగా బతిమాలించుకొని, శ్రీమతి చెప్పిన వివరాలేమీ ఎక్కువ లేవు. వారం రోజుల క్రితమే సీతాపతి ఈ పని చేశాడట. నాకు వెంటనే ఉత్తరం రాయాలనుకొందిట గాని నేను త్వరలోనే వచ్చేస్తాను కదా అని, ఆ ప్రయత్నం విరమించుకొందట. రెండు రోజుల క్రితం, సీతాపతి మా యింటికి వచ్చి, నేనెప్పుడొచ్చేదీ కనుక్కొని వెళ్ళాడట.

భోజనం ముగించి, పడక కుర్చీలో నడుం వాల్చి, మగతగా కళ్ళు మూశాను. ఏవో ఆలోచనలు, గతించిన స్మృతులు, మనసును ముసురుకోసాగాయి.

ముండల్ని ఉంచుకోవడం మా ఊళ్ళో కొత్తేమీ కాదు. ఇంట్లో రంభల్లాంటి పెళ్ళాలున్నా, ఎవర్నో తమ ప్రాపకంలో ఉంచుకోకపోతే తమకి నామర్దా అనుకొనేవాళ్ళు—'మా తాత ముత్తాతల దగ్గర్నించీ మా వంశంలో ముండ నుంచుకోని వాడు లేడు తెలుసా!' అని గర్వంగా చెప్పుకొనే వాళ్ళు—మా ఊళ్ళో చాలా మంది ఉన్నారు. ఆస్తి లమ్ముకొని సన్యాసులైన వాళ్ళు, రోగాలతో వళ్ళు కుళ్ళిపోయి ఆత్మహత్యలు చేసుకొన్న వాళ్ళు, ఈ వ్యవహారాల్లో తగాదాల్లు వచ్చి హత్యలు చేసిన వాళ్ళు-మా ఊరి చరిత్రలో చాలామంది ఉన్నారు

అయితే పెళ్ళాం చచ్చిపోయిన పాతిక సంవత్సరాలకి, కూతురు కాపరానికి వెళ్ళిన రెండేళ్ళ తర్వాత—సీతాపతి యిటువంటి పని చేశాడంటే, అది నాకాశ్చర్యకరమైన విషయంగా నే తోచింది!

వీధిబడిలో ఒకటో తరగతి నుంచి, కాలేజీలో బి. ఏ. వరకూ సీతాపతీ, నేనూ కలిసి చదువుకున్నాం. క్లాసులు ఎగ్గొట్టి సినిమాలు చూసినా, రహస్యంగా మా తోటలో సిగరెట్లు కాల్చినా, ఏలేరులో ఈతలు కొట్టినా, ఇద్దరమూ కలిసే చేసే వాళ్ళం. అయితే సీతాపతిలో చొరవ కాస్త ఎక్కువేనని చెప్పుకోవాలి. అతనికున్నంత తెగింపు నాలో ఉండేది కాదు.

పెద్దలు సంపాదించిన భూములు అంతో యింతో ఉండడంవల్ల, మేం యిద్దరంకూడా, మరి పై చదువులకి వెళ్ళకుండా, వ్యవసాయంలో దిగిపోయాం. సీతాపతి జీవితంలోకి కొన్ని సమస్యలు తొంగిచూశాయి. ఆ సమస్యల మీద బుట్ట బోర్లిస్తే, సీతాపతి జీవితం చాలా హాయిగానే గడిచిపోయి ఉండేది. అయితే సీతాపతి ఆ సమస్యల్ని మరింత కఠినతరం చేసుకొని, పరిష్కారం కావించాడు. మా బి. ఏ. పరీక్షా ఫలితాలు వచ్చిన రోజుల్లోనే, సీతాపతి చెల్లెలు రాధ పెళ్ళయింది. పెళ్ళయిన పది

రోజులకే రాధ భర్త గుండె ఆగి చనిపోవడం, వాళ్ళ కుటుంబానికి పెద్ద గొడ్డలిపెట్టే అయిండి. ఓ నెల రోజుల పాటు సీతాపతి పిచ్చివాడై పోయాడు.

ఓ రోజు సాయంత్రం నేను పొలంలో ఉండగా, సీతాపతి హుషారుగా నా దగ్గర కొచ్చాడు. సీతాపతి కళ్ళు,కొత్త కాంతిని పుంజుకొన్నాయి. నా పక్కనే ఎండుగడ్డిమీద కూలబడి, సిగరెట్ ముట్టించి అన్నాడు. "ఒరేయ్, ఇవ్వాళ ఇంట్లో చాలా పెద్దగొడవే జరిగిందనుకో. అయినా అంతిమ విజయం నాదే !" సీతాపతి ఏ విషయం గురించి రాద్ధాంతం చేశాడో, ఊహించుకోగల్గాను. అయితే సీతాపతి నోటమ్మటే విందామని, మౌనంగా ఉండిపోయి, చెప్పమన్నట్లుగా చూశాను ఆదినుంచీ సమాజంలో దానికి జరుగుతున్న అన్యాయాల్ని గురించి అరగంటసేపు ఉపన్యాసం దంచి, చివరకు, రాధకి మళ్ళీ పెళ్ళి చెయ్యడానికి తను కంకణం కట్టుకొన్నట్లు చెప్పాడు. సీతాపతిని పరీక్షగా చూస్తూ అడిగాను "సరే నీ తల్లి దండ్రుల్ని ఒప్పించకలిగావు కాని లోకానికి సమర్థించి చెప్పగల ధైర్యం ఉందా నీకు ?"

"ఇంట గెలిచాను కదా, బయట గెలవడానికి నీలాంటి స్నేహితుల అండ దండలు కావాలి నువ్వంటున్న లోకంలో ముందరగా మనం కలుసుకోవలసింది, రాధ అత్త మామల్ని. రేపు నేను కాకినాడ వెడ్తున్నాను. నువ్వు కూడా నాతో రావాలి !"

నేను కొంచెం యిబ్బందిగా చూస్తూ అన్నాను. నేను మీ అంతరంగిక విషయాల్లో కలగజేసుకొంటే అంత బావుండదనుకొంటాను."

సీతాపతి గట్టిగా నవ్వసాగాడు. నేను తెల్లబోతూ చూశాను. "ఒరేయ్, అందరూ నీలాగే ఉంటే, నువ్వనే ఈ లోకం ఉండేదికాదు. రాధకి రెండో పెళ్ళి మా అంతరంగిక విషయమైతే, లోకం మమ్మల్ని వేలెత్తి ఎందుకు చూపాలి ? ఒకరి విషయాల్లో జోక్యం కలగజేసుకోవడానికి సమాజానికి హక్కు ఉన్నపుడు వాళ్ళు కష్టాల్లో ఉన్నప్పుడు సహాయం చేసే యిది కూడా సమాజానికుండాలి. లేనినాడు ఆ సమాజం కుళ్ళిపోయిందనే చెప్పుకోవాలి. కబుర్లు కట్టిపెట్టి, రేపు నాతో రావడానికి సిద్ధంగా ఉండు !" సీతాపతి మాటలకు జవాబులేదు నేనన్న మాటలకోటే, నా నోరు మూయించాడు.

"ఆ పద్ధతిలో, నేనొక్కడ్నే మీ రాధ అత్తారింటికి వెళ్ళి, మీ ఉద్దేశ్యాన్ని వాళ్ళ చెవిని వేస్తే బావుంటుందేమో? తర్వాత మీరు వివరంగా మాట్లాడుకోవచ్చు." నా అంగీకారాన్ని పరోక్షం తెలియజేశాను.

సీతాపతి ఒక్క క్షణం మౌనంగా ఉండితర్వాత అన్నాడు. "నువ్వు చాలా మెతక మనిషివి వాళ్ళేమైనా మాటలంటే

అనవసరంగా మధ్య నువ్వు పడవలసి వస్తుంది. మనిద్దరం వెడ్దాం. నువ్వేమీ మాట్లాడ నక్కర్లేదు. ఊరికే నా పక్క-నుండు నాకంతే చాలు."

ఇద్దరమూ, లేచి పొలం గట్లమ్మట బయలుదేరాం. దారిలో అన్నాను ఒరేయ్, రాధకి మళ్ళీ పెళ్ళిచేద్దామనుకొంటున్నారు కదా. పెళ్ళికొడుకులు దొరకడం చాలా కష్టమవుతుందనుకొంటాను."

చేతిలో ఉన్న సిగరెట్ పొలంలోకి విసిరేస్తూ, "మీ మామయ్య కూతురు శ్యామలతో నీ పెళ్ళి కనక నిశ్చయం అవకపోతే నాకా కష్ట ముండేదికాదు !" అన్నాడు నేను ఒక్క-సారిగా ఉలిక్కి-పడ్డాను. నా అంతరాంతరాల్లో నా అ స హా య త వ ల్లా, పిరికితనంవల్లా అణగారిపోయిన భావన–అప్రయత్నంగా మాటల రూపంలో బయటకు వచ్చేసింది "శ్యామల పుట్టి ఉండకపోతే, ఇప్పుడేం ఖర్మ ! మీ రాధ మెళ్లో మొదట్లోనే, నేను తాళి కట్టేవాణ్ణేమో !" సీతాపతి ఆగాడు. జబ్బ పట్టుకొని నన్ను తన వైపు తిప్పుకొని అన్నాడు. "అప్పన్నా, రాధ నిజంగా దురదృష్టవంతురాలు. దానిక్కా-రణం, ఏ తాళ్ళకు బంధం వేసిన మేనరికమూ–ఆ బంధాన్ని తెంచుకోలేని నీ అసహాయతానూ. అయినా, ఛ ! ఛ! యివి నేనవవలసిన మాటలు కావు. శ్యామల అదృష్టానికి నేను సంతో-షిస్తున్నాను." సీతాపతి గొంతు పూడుకుపోయింది.

ఆ మర్నాడుదయం, నేనూ, సీతాపతీ కాకినాడ వెళ్ళాం. మేం వెళ్ళేసరికి రాఘవయ్యగా రింట్లోనే ఉన్నాడు. పలకరింపులూ అవీ అయిన తర్వాత, సీతాపతి అసలు విషయాన్ని నెమ్మదిగా కదలేశాడు. "మావగారూ, మా రాధకి మళ్ళీ పెళ్ళి చేద్దామనుకొంటున్నాము."

నడవ గుమ్మం దగ్గర నిల్చున్న శారదాంబగారు విరుచుకుపడింది. "సిగ్గు లేకపోతేసరి ! యింట్లో అడుగు పెడ్తూనే నిండు ప్రాణాన్ని తీసింది. తగుదునమ్మా అని మళ్ళీ పెళ్ళికి తయారవుతోంది. ఇలా ఎంతమంది ప్రాణాల్ని తీస్తారు మీరు ? అయినవాళ్ళందరిలోనూ మాకు తలవంపులు తీసుకురావాలనా ?"

ఆవిడ వాలకం చూసి నాకు నిజంగానే భయమేసింది. సీతాపతి అన్నట్లు, నేనైతే తిరిగి సమాధానం చెప్పలేకపోయేవాణ్ణి. సీతాపతి మొహం కోపంతో ఎర్రగా కంది పోయింది. శారదాంబగారితో కాకుండా, రాఘవయ్యగారితో అన్నాడు. "చూడండి రాఘవయ్యగారూ, మారాధని ఆడిపోసుకోవడం ఏమంత సమంజసమైన మాట కాదు. గుండెజబ్బు ఉన్న మీ కొడుక్కి- అసలు పెళ్ళిమాట తలపెట్ట కుండా ఉండవల్సింది పోయి, ఆ విషయాన్ని దాచిపెట్టి, దారుణంగా ఓ స్త్రీ జీవితాన్ని నాశనంచేశారు మీరు !

అయినకాడికి పదివేలూ కట్నం పుచ్చుకొని, మీరు మా రాధకిచ్చిందేమిటి? మూడు రోజుల జీవితమూ—పదికాలాల పాటు వైధవ్యమూను! మనమందరమూ బలహీనతలున్న మామూలు మానవులం. ఆ బలహీనతలవల్ల వయసులో ఉన్న మా రాధ దారితప్పి, మీకూ, మాకూ తలవంపులు తెచ్చేకన్నా, ఆ అవకాశం రాకుండా రాధకి మళ్ళీ పెళ్ళిచేస్తే, అన్ని విధాలా వుంటుంది." సీతాపతి చాలా బలంగా అన్న మాటలకి శారదాంబగారు నోరెత్తలేకపోయింది. రాఘవయ్యగారు తేరుకొని అన్నాడు, పేలవంగా. "కొడుకులు పెళ్ళిళ్ళు చేసుకొని సుఖంగా ఉండాలని ఏ తల్లిదండ్రుల కుండదు?"

"మీ రన్నమాట నిజమే. అదే మాట ఆడపిల్లని కన్నవాళ్ళక్కూడా వర్తించదా మరి? అయినా ఏ క్షణాన్నైనా ఆరిపోయే దీపాన్ని, జీవితాంతం మరొకరికి ఆసరాగా యివ్వ బూనడం చాలా అన్యాయమంటాను. ఎవరికీ ఏ విధమైన యిబ్బందీ కలగకుండా, తాత్కాలికమైన అవసరాలు తీర్చుకోడానికీ, లోకాన్ని ఖాతరుచెయ్యకుండా నెట్టుకుపోవడానికీ, మగవాళ్ళకి చాలా సదుపాయాలూ, మార్గాలూ ఉన్నప్పుడు—గుండె జబ్బుకల మీ కొడుక్కి పెళ్ళి అనవసరమే అంటాను. అన్నీ తెలిసి మీరు మరొకరి గొంతుక కోశారు!" కుండబద్దలుకొట్టినట్లుగా సీతాపతి అన్నమాటలకు, నేనే అచేతను పోయాను. రాఘవయ్యగారు మాట్లాడ లేదు.

"రెండో పెళ్ళి చేసుకోవడానికి ఎవరు వస్తారయ్యా ముందుకు?!" శారదాంబగారు అక్కసుగా అంది. సీతాపతి చివరి బాణం విసిరాడు. "రాధ అన్నివిధాలా సర్వస్వతంత్రురాలు. తన జీవితాన్ని తన యిష్టానిష్టాల కనుగుణంగా గడుపుకోవడానికి ఏ విధమైన లోటూ ఉండదనుకొంటాను. ఎందుకంటే, మీ పిత్రార్జితమైన ఆస్తిలో రాధ భర్త వాటా పాతిక ఎకరాల వరకూ వస్తుందనుకొంటాను. పదివేలకి గుండెజబ్బు మనిషి దొరకగా లేంది, పాతిక ఎకరాలకు కనీసం కుంటివాడైనా దొరక్కపోడా!" శారదాంబగారు తెల్లబోయింది. అక్కడ ఉండలేక లోపలికి వెళ్ళిపోయింది. రాఘవయ్యగారు యిబ్బందిగా మొహం పెట్టాడు. మళ్ళీ సీతాపతే అన్నాడు— "మావగారూ, మిమ్మల్ని బెదిరించాలని నా ఉద్దేశ్యం కాదు. మీ ఆస్తిమీద మమకారం మాకసలే లేదు. మాక్కావల్సిందల్లా, మీ అంగీకారం మాత్రమే. మీ అంగీకారం ఉందని తెలిస్తే, మన రెండు కుటుంబాలకీ చాలా గౌరవంగా ఉంటుంది."

డబ్బు పేరు ఎత్తేసరికి, మనుషుల్లో వచ్చే మార్పుని మొదటిసారిగా ఆ రోజు గుర్తించగలిగాను. "సరే మీ యిష్ట ప్రకారమే కానీయండి. రాధకి ఎంత

కట్నం యివ్వవలసి వస్తుందో నాకు తెలియజేయండి ఆ డబ్బు నేనే యిచ్చు కొంటాను," అని రాఘవయ్యగారు లోపలికి వెళ్ళిపోయారు. ఆ హఠాత్పరిణామానికి మేమిద్దరమూ కూడా తట్టుకోలేకపోయాం !

అయితే రాధకి వరుణ్ణి వెదకడంలో, సీతాపతీ, వాడితోపాటు నేనూ చాలా కష్టపడవలసి వచ్చింది. ఓ ఏడాది శ్రమపడ్డ తర్వాత, అభ్యుదయ భావాలుగల ఓ డాక్టరుతో రాధ వివాహం జరిగిపోయింది. రాఘవయ్య దగ్గరుండి వివాహం చేయించి,నలుగురిచేతా'ఓహో' అనిపించుకొన్నాడు. తన భూమిని పైకి పోకుండా కాపాడుకొన్నాడు. సీతాపతి శ్రమని ఎవరూ గుర్తించలేదు. అందుకు తను బాధపడలేదు. రాధ జీవితం బాగుపడింది. దానికే సీతాపతి చాలా సంతోషించాడు.

మరో ఏడాదిలో మేం కూడా జీవితాల్లో సర్దుకొన్నాం. సీతాపతి అదృష్టం ఎందుకనో వక్రగతిని పట్టింది. రెండేళ్ళ పిల్లని ఇంట్లో ఉంచి, పేరంటానికి వెళ్ళి తిరిగి వస్తూన్న సీతాపతి భార్య, ప్రమాదవశాత్తూ లారీకింద పడి ఈ లోకం విడిచిపెట్టడంతో, సీతాపతి నిజంగా క్రుంగిపోయాడు. ఓ ఆర్నెల్ల పాటు సీతాపతి బయటకు రాలేదు. తర్వాత తర్వాత నెమ్మదిగా నిలదొక్కుకొని, మామూలు మనిషిగా తయారయినా, చాలా నిర్లిప్తంగా కాలం గడిపేయసాగాడు. కొంతకాలం వ్యవధి యిచ్చి, మేం అందరం సీతాపతిని మళ్ళీ పెళ్ళిచేసుకోమని, ఎంతగానో బలవంతం చేశాం. సీతాపతి మొండికెత్తి కూర్చున్నాడు. "నా జీవితంలో అదృష్టమనేది లేదు. నా కూతురికి సవతితల్లిని తీసుకురాలేను. అటు అమ్మమ్మా, యిటు నాయనమ్మా ఉన్నంతకాలం, గౌరికి ఆడదిక్కూ, పాలనా ఉండవన్న బెంగ నాకు లేదు ఇక నా జీవితమంటారా ? నాకు లభించిన అనుభవం చాలు!" అప్పటికీ మధ్య మధ్యలో సీతాపతిని విసిగించడం మానుకోలేదు. కొంతమంది కావలసినవాళ్ళు.

ఉన్నట్టుండి ఓ రోజు సీతాపతి ఎవరితోనూ చెప్పకుండా,ఆపరేషన్ చేయించుకొన్నాడు నాకు కబురందిచూడ్డానికి వెళ్ళాను సీతాపతి నవ్వుతూ అన్నాడు— "ఈ విధమైన పిచ్చితుగ్లక్ పని ఎందుకు చేశానో అని నువ్వు ఆశ్చర్యపడవచ్చును. ప్రతిరోజూ మీరందరూ బలవంతపెడ్తూంటే, నా నిర్ణయం సడలిపోతుందేమోనన్న భయం వేసింది. ఇప్పుడు నా జీవితంలో ఏ స్త్రీ ప్రవేశించినా గౌరి తల్లిగానే ఉండిపోవలసి వస్తుంది! ఇంకెవరూ నన్ను పెళ్ళిచేసుకోనేరు ! ?" సీతాపతి మా అందరి ప్రయత్నాల్ని ఒక్క గొడ్డలిపెట్టుతో నరికి పారేశాడు. సీతాపతి జీవితాన్ని మా సారథ్యంతో

మలుపు తిప్పలేమని ఆరోజున తెలిసి రావడంతో, మేమెవ్వరమూ మరి సీతాపతి పెళ్ళిప్రసక్తి తీసుకురాలేదు.

కాలగర్భంలో మృత్యువుకి దగ్గరగా ఎన్నో మెట్లు ఎక్కిన తర్వాత, సీతాపతి అనుకోని విధంగా ఈ పని ఎందుకు చేశాడో ఊహించలేకపోయాను. గౌరికి పెళ్ళయి అప్పుడే రెండేళ్ళయింది. ఒక కుర్రాడు కూడాను.

నా ఆలోచనలకి భంగం కలిగిస్తూ శ్యామల తట్టి లేపింది. శ్యామల వెనకనే ఉన్న గౌరినీ, ఆమె భర్త శ్రీనివాసునీ చూడ్డంతో, సీతాపతి చేసిన ఘనకార్యం పెద్ద అలజడే కలిగించిందని ఊహించుకో గలిగాను. నవ్వు తెచ్చుకొంటూ, "రావోయ్, అల్లుడూ రా. ఏమమ్మా గౌరీ ఎప్పుడు వచ్చావు? పిల్లవాడేడీ?" అన్నాను.

"మీరు వచ్చారని తెలిసి ఇప్పుడే వచ్చాం బాబాయ్. పిల్లవాణ్ణి తీసుకు రాలేదు. చూశారా, మీ స్నేహితుడెంత పనిచేశాడో?" గౌరి ఆగింది శ్రీనివాసు మొదలుపెట్టాడు. "మావగారు చేసిన పనికి అభ్యంతరం చెప్పడానికి మాకేం హక్కుంది కనక? కాని, మీ మావగారు గోపాలకృష్ణుడయ్యాడట! ఇన్నేళ్లూ ఊరు కొని ఇప్పుడిదేం బుద్ధి?' అని, అయిన వాళ్ళూ కానివాళ్ళూ దెప్పిపొడుస్తూంటే చాలా సిగ్గుగానూ, అవమానంగానూ ఉంటోంది. ఇటు ఇంట్లో చూస్తే,, మా అమ్మ అస్తమానూ గౌరిని దెప్పి పొడుస్తోంది గౌరి బాధని నేను చూడ లేకపోతున్నాను" గౌరియెడల శ్రీనివాసు కున్న ప్రేమని గుర్తించి, నేను మనసులో సంతోషించాను

"అవును బాబాయ్, నాన్న ఈ ఘన కార్యం చేసిన మరుసటిరోజునే, కొన్ని కాకులు పనికట్టుకొని మా ఊరు వచ్చి చెప్పివెళ్ళిన మరుక్షణం నుంచీ, అత్తయ్య ధోరణి మారిపోయింది. నాన్న తన సుఖం చూసుకొన్నాడే కాని, నా సంగతి ఆలోచించలేదు." గౌరి అన్న మాటలకు నాకు ఒక్కసారిగా కోపం వచ్చింది కాస్త కటువుగానే అన్నాను. "చూడమ్మా గౌరీ, నువ్వనవలసిన మాటలేనా యివి? నీకోసం మీ నాన్న ఎంత త్యాగం చేశాడో నీకు తెలుసుండే, యిలా అనడం భావ్యంకాదు. ఏమోయ్ శ్రీనివాసూ, ఎవరో ఏవో మాటలన్నారనే, ఈ కాలపు యువకుడవై యుండీ బాధపడడం చేతకా తనమే అవుతుంది. ఓ నవ్వు నవ్వేసి 'ఆ ఊరివాళ్ళ కది అలవాటేలే' అంటే వదిలిపోతుంది విషయాన్ని మనసుకి పట్టించుకొని ఏం ప్రయోజనం? మీ అమ్మగారికి నచ్చజెప్పవలసిన బాధ్యత నీదే".

సీతాపతిని ఈ విధంగా సమర్థిస్తానని వాళ్లనుకోలేదు. తిక్కమొహం వేసిన గౌరిని చూసి జాలివేసింది. వాళ్ళిద్దరూ మౌనంగా ఉండిపోయారు. నిశ్శబ్దాన్ని

భంగపరుస్తూ నేనే అడిగాను. "మీ నాన్న యింట్లో ఉన్నాడా?"

"తోటలో ఇంట్లో, ఆవిడగారితో పాటు ఉంటున్నాడు. నిన్న సాయంకాలం మేం వచ్చిన తర్వాత, కబురంపినా రాలేదు!" అన్నది గౌరి. ఆ మాటల్లో ఉడుకుబోతుతనం కొట్టవచ్చినట్లు కనబడింది. పుట్టింటి తరపున, తనకు నా అన్నవాళ్ళెవరూ లేరన్న బాధ గోచరించింది.

"సరే మిమ్మల్ని నిరుత్సాహపరచడ మెందుకు? వెంకటస్వామిని బండి తీసుకురమ్మని చెప్తాను. మనందరం, అక్కడికే వెళ్దాం." మీ నాన్న ఏమంటాడో చూద్దాం?" అన్నాను, కుర్చీ లోంచి లేస్తూ.

దారిలో నా ఆలోచన రత్నావతి మీదకు మళ్ళింది. ఓ పదిహేనేళ్లపాటు మా చుట్టుపక్కల ఉన్న అన్ని నాటకాల కంపెనీలకీ రత్నావతే హీరోయిన్ అనీ, వయసులో ఉన్నప్పుడు రత్నావతి కోసం కనీసం యిరవై మందైనా బుర్రలు బద్దలుకొట్టు కొన్నారనీ చెప్తే, ఆమె అందాన్ని వేరే వర్ణించ నవసరం లేదనుకొంటాను.

మమ్మల్ని చూస్తూనే, మామిడిచెట్టు కింద పడక్కుర్చీలో విశ్రాంతి తీసుకొంటూన్న సీతాపతి ఒక్కసారిగా కంగారుపడిపోయాడు. పక్కనే తుంగ చాపమీద కూర్చున్న రత్నావతి లేచి నిల్చుని, బెదురు బెదురుగా చూడసాగింది. పసుపు రాసుకొని స్నానం చేసిన ఛాయలు, నుదుట రూపాయకాసంత కుంకంబొట్టు, కంజీవరం పట్టుచీర – అపర లక్ష్మీదేవిలా ఉన్న రత్నావతిని చూడగానే, నా కళ్లను నేను నమ్మలేక పోయాను. ఆమె కళ్లలో ఓ రకమైన ఆవేదన కొట్టవచ్చినట్లు కనబడ్తోంది.

సీతాపతి తేరుకొని నవ్వుతూ అన్నాడు– "ఏరా, వీళ్ళిద్దర్నీ తీసుకొని దండయాత్రకి వచ్చినట్లున్నావ్? ఏమోయ్ శ్రీనివాసూ, మీ యింట్లో అందరూ కులాసానా? ఏం గౌరీ అలా చూస్తున్నావ్? యిదుగో నేను ఉంచుకున్న మీ అమ్మ!" యిబ్బంది కలిగించే ఆ సమయంలో కూడా, సీతాపతి నవ్వుతూ మాట్లాడ్డం చూసి, నేను కొంత విస్మయం పొందాను.

"రామ్మా గౌరీ, యిలా కూర్చో. పేరుకు తగ్గట్టు, గౌరీదేవిలాగే ఉన్నావమ్మా! మనవణ్ణి తీసుకరాలేదేం?" రత్నావతి చొరవతీసుకొని, మంత్ర ముగ్ధలా నిల్చున్న గౌరి చెయ్యి పట్టుకొని చాపమీద కూర్చోబెట్టింది. నేనూ, శ్రీనివాసూ పక్కనే ఉన్న కుర్చీల్లో కూర్చున్నాం. 'ఇదంతా ఏమిట్రా?' అన్నట్లుగా సీతాపతికేసి చూశాను. నా చూపులో అర్థాన్ని సీతాపతి యిట్టే గ్రహించాడు. బుర్ర వంచుకొని నేలకేసి చూస్తూ అన్నాడు. "నేనిటువంటి పని



మీ కెవరికీ ఇష్టం లేదని
ా చేశానూ అన్న
ా చిన్నది గౌరి

పెళ్ళయి అత్తింటికి వెళ్ళిపోయిన తర్వాత
నా జీవితం అంతా శూన్యమనిపించింది.
ఆత్మహత్య చేసుకోబోతున్న రత్నావతిని

రక్షించడం. నా వంటరితనాన్ని పంచుకోడానికి సిద్ధపడిన ఆమె మెళ్లో నేను పసుపుకొమ్ము కట్టడం—అనుకోకుండా, దైవికంగా జరిగిపోయాయి రత్నావతి నా ఇల్లాలు. కాని లోకందృష్టిలో ఉంపుడుకత్తె! మీరు, నేను రత్నావతిని ఉంచుకొన్నానని భావిస్తే, నేను చెయ్యగలిగింది ఏమీలేదు!"

"అంతా బాగానే ఉంది. కాని నీ వియ్యాలవారి పరువు ప్రతిష్టలూ, అన్నింటికి మించి అత్తింటిలో గౌరి అలుసైపోతుందన్న సంగతి, నీ దృష్టిలో పెట్టుకొంటే బావుండేదనుకొంటాను!" నేను కొంచెం నిష్ఠూరంగానే అన్నాను.

నేనన్న మాటలకు సీతాపతి తల ఎత్తి చూశాడు. శ్రీనివాసుతో అన్నాడు. "విధవా వివాహం చేసిన ఘనత పేరుకే కాని, చాలా సంవత్సరాల తర్వాత, గౌరి పెళ్ళి విషయంలో అది ఎంత ప్రతిబంధకమైందో దేముడికే తెలుసు. చివరకు నువ్వు గౌరి అందాన్ని చూసి మోజు పడ్డావు నీ వాళ్ళు ఆశించింది మరొహటి ఇప్పుడు ఈ గొడవలోపడి, మీ చేతి కందవలసింది మరొకరి పరమైపోతుం దన్న భయం మీ కుండగం సహజం అయితే మీకా బెంగ అఖర్లేదు. మీ ఊరికి దగ్గరగా ఉన్న ఇరవై ఎకరాల భూమిని గౌరి పేర రిజిష్టరు చేయించాను. ఇక నుంచీ ఆ వ్యవహారాలన్నీ మీరే చూసుకోండి. ఇదిగో ఈ ఎకరం తోటా, దీని కానుకొని ఉన్న నాలుగెకరాల భూమీ. నా అనంతరం రాధకు చెందుతాయి."

శ్రీనివాసు కళ్ళలో ఓ చిన్న మెరుపు నేను గమనించకపోలేదు. అయితే సీతాపతి మాటలకు, శ్రీనివాసు సిగ్గుపడి మాట్లాడలేకపోయాడు

అంతవరకూ మౌనంగా కూర్చున్న గౌరి విజృంభించింది. నువ్వు డబ్బుతో కొనిపెడ్తున్న గౌరవం నా కఖర్లేదు! వంటరితనం భరించలేక ఇప్పుడీ పని చేశానంటున్నావ్. అలాగే మగ దిక్కులేదని, ప్రతి ఆడదీ ఎవణ్ణో ఒకణ్ణి పట్టుకొంటే!"

"అవి వ్యక్తిగతమైన సమస్యలు దానివల్ల కలిగే పరిణామాలకి నిలదొక్కుకో కలిగితే, ఇంకా కళ్ళు జోక్యం కలుగ చేసుకోవలసిన అవసరంలేదు." సీతాపతి నెమ్మదిగా అన్నాడు.

"మరి రాధత్తయ్య అటువంటి పనేదైనా చేస్తుందని భయపడేగా నువ్వు మళ్ళీ పెళ్ళి చేసింది! అమ్మ పోయిన తర్వాత నువ్వు మళ్ళీ పెళ్ళిచేసుకొని ఉంటే, నాకీ రోజున ఇంత అవమానం జరిగేదికాదు!" ఈ మాటని గౌరి, సీతాపతిని నిరుత్తరుణ్ణి చేసింది. నా కేసి జాలిగా చూశాడు ఆ చూపుల్లో ఓ రకమైన నిస్సహాయత ఎందుచేతనో. సీతాపతి ఆడదాని పొందు కోసం చేశాడన్న నమ్మకం రిగ్గాతో అన్నాను



మీ నాన్నని అపార్థంచేసుకొంటున్నావ్. ఇంతకాలం మరో స్త్రీ మాట ఎత్తకుండా ఉన్నాడంటే, అది నీ జీవితం కోసం మీ నాన్న చేసిన త్యాగం. ఇప్పుడు నువ్వు హాయిగా నీ సంసారం చేసుకొంటున్నప్పుడు, మీ నాన్న ఈ పనిచేసినందుకు నువ్వు విచారించనవసరంలేదు. ప్రాణాలు తీసుకోబోతున్న ఓ పతితని ఆ ప్రయత్నంనుంచి విరమించుకొనేటట్లు చెయ్యడం కోసం, మీ నాన్నలోని శివర్ణి ఈ పని చేయించి దనకొంటాను. మీ నాన్న కళ్లలోకి ఒక్కసారి చూడు. ఈమె సహచర్యంలో అతనెంత శాంతి పొందుతున్నదీ తెలుస్తుంది. చివరిదశలో మీ నాన్నకి లభించిన ఈ ఆనందాన్ని దూరం చెయ్యకమ్మా."

రత్నావతి కళ్లలో నీళ్ళు తిరుగుతున్నాయి. గౌరిని తన వైపు తిప్పుకొంటూ గాద్గదికంగా, "సుఖంగా పెళ్ళిళ్లు చేసుకొని, పిల్లా జెల్లాతో హాయిగా సంసారాలు చేసుకొనే అదృష్టం నాలాంటి అభాగినులకు లేదు. జీవితంమీద రోత పుట్టి, ప్రాణాలు తీసుకొనే సమయంలో ఈయన అడ్డుకొన్నారు. చీకటిలో పోతున్న నాకు ఓ వెలుగు రేఖను చూపారు. వళ్లమ్ముకొని సంపాదించిన వేలకొలదీ రూపాయల్ని అనాధాశ్రమానికి దానం చేయించి, నా చేత ఓ మంచిపని చేయించారు. జీవితాంతమూ పతితగానే ఉండవలసిన నాకు, చివరిదశలో ఓ గృహిణిగా స్థానం కలగజేశారు. మీ నాన్న నాకు వాగ్దానం చేసిండి, మెళ్లో ఈ తాడు, నేను పోయిన తర్వాత నా కోసం

ఓ రెండు కన్నీటి బిందువులు. ఒకరి ఆశ్రయంలో మరొకరం ఓ రకమైన శాంతితో, బతుకుతున్నాం. నా గురించి కాకపోయినా, మీ నాన్న గురించైనా ఈ ఉంచుకొన్న అమ్మని క్షమించలేవూ?" రత్నావతి ఒక్క క్షణం ఆగింది. గౌరి కళ్లలో నీళ్లు నిండాయి. రత్నావతికేసి చూస్తూ ఉండిపోయింది. రత్నావతి తన మెళ్లోని చంద్రహారాన్నీ, చేతినున్న బంగారపు గాజుల్నీ, చెవినున్న రవ్వల దుద్దుల్నీ తీసి గౌరి ముందు ఉంచుతూ అంది-"మీ నాన్నగారు నాకు గృహిణిగా స్థానమిచ్చారు. తల్లిగా కూడా స్థానం సంపాదించాలనుకొంటున్నాను. అదొక్కటే నాకు మిగిలిపోయిన కోరిక. అది నీ చేతుల్లో ఉందమ్మా. ఈ నగలన్నీ నేను నాటకాలు వేసి, నాట్యాలు చేసి న్యాయంగా సంపాదించుకొన్న సొమ్ము. ఈ రోజున నా కూతురిలాగా ఇక్కడకు వచ్చావు ఈ తల్లి యిస్తున్న కానుక లందుకొంటే, నా జీవితం ధన్యమై పోతుంది. అంతకుమించిన అదృష్టం నాకీ జన్మలో ఉండదు. నువ్వు నిరాకరిస్తే, నాయంత నిర్భాగ్యురాలీ లోకంలో లేదనుకొని, మీ అందరి జీవితాలనుంచీ శాశ్వతంగా, మీ కెవరికీ కష్టం కలుగని విధంగా దూరంగా వెళ్ళిపోతాను..." రత్నావతి మరి మాట్లాడలేకపోయింది. గౌరి హృదయం కరిగిపోయిందని వేరే చెప్పనక్కర్లేదు. తండ్రికేసి చూసింది. ఆ కళ్లలో ఏదో అభ్యర్థన. నాకేసి చూసింది. ఉత్సాహంగా చిరునవ్వు నవ్వాను. మొగుడికేసి చూస్తూ ఉండిపోయింది. అతని కళ్ళలో-సుమారు పదిహేనువేల రూపాయలు చేసే బంగారాన్ని గౌరి కాదంటుందేమోనన్న భయం, ఒక వేశ్య దగ్గర తన భార్య, కూతురు లాంఛనాలుగా నగలు పుచ్చుకొందని నలుగురూ హేళనచేస్తారేమోనన్న భయం – నాకు గోచరించాయి.

సీతాపతి ఎంత నాకు అప్తుడైనా, ఆ క్షణంలో వాళ్లందరికీ నేను పైవాడినే అన్నభావం నాలో కలిగింది. వెంటనే మౌనంగా అక్కణ్ణించి లేచి యింటిదారి పట్టాను.

మీరే కనక శ్రీనివాసు పరిస్థితిలో ఉంటే ఏం చేస్తారు? ఈ కథకి ముగింపు మీ చేతిలోనే ఉంది.